క్లుప్తంగా

రీ సర్వే గ్రామ సభకు 37 అర్జీలు

కరప: మండలంలోని నడకుదురులో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు 37 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో రైతులు తమ భూములకు సంబంధించి రీ సర్వేలో లోపాలు, పేర్ల సవరణలు, భూ విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబర్ల సబ్ డివిజన్, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు తదితర అంశాలపై అర్జీలు ఇచ్చారు. గ్రామ సభల షెడ్యూల్ పూర్తయ్యాక ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. మండల సర్వేయర్ ఎస్.రూపవతి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, వీఆర్వోలు చాగంటి వరుణ్‌వెంకట్, కె.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కన్వీనర్‌గా తిరుమలశెట్టి

కాకినాడ రూరల్: సీపీఎం కాకినాడ రూరల్ మండల కమిటీ నూతన కన్వీనర్‌గా తిరుమలశెట్టి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఇంద్రపాలెంలో నిర్వహించిన సీపీఎం మహాసభలో నూతన కమిటీని జిల్లా నాయకత్వం ప్రకటించింది. సభ్యులుగా పి.రామకృష్ణ, వి.సూర్యం, సీహెచ్ విజయ్‌కుమార్, టి.రాజా, సీహెచ్ అజయ్‌కుమార్, పద్మ ఎన్నికయ్యారు. నూతన కమిటీని సీపీఎం జిల్లా, మండల నాయకులు, సభ్యులు అభినందించారు.

విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్ అందజేత



పోటీ పరీక్షల మెటీరియల్ అందిస్తున్న శ్యామ్. చిత్రంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్దనున్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్‌ను పూర్వ విద్యార్థి, శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్యామ్ అందజేశారు. పీజీ సెంటర్‌లో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎం.పోచయ్య, రాధా మాధవి అధ్యక్షతన విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కమలకుమారి, మాణిక్ రెడ్డి సత్యనారాయణ, యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీదేవి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

బోట్‌క్లబ్: విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే తమ లక్ష్యాలను సాధించడానికి అవకాశం ఉంటుందని ప్రముఖ చర్మవ్యాధి నిపుణుడు త్రిమూర్తులు రాయుడు అన్నారు. రోటరీ చేయూత భవన్‌లోని ఆశ్రమానికి చెందిన విద్యార్థులకు శుక్రవారం ఉచిత ఆరోగ్య చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవికుమార్ మాట్లాడుతూ, తమ ఆశ్రమంలో 45 మంది విద్యార్థులు ఉంటున్నారన్నారు. వారందరికీ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు.

దేవదాయ శాఖను ధనాదాయ శాఖగా మార్చారు

ఆధ్యాత్మిక వేత్త దూసర్లపూడి ఆవేదన

బోట్‌క్లబ్: విజయ దశమి సందర్భంగా స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో టిక్కెట్టు దర్శనం కొనసాగించడం సరికాదని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కార్తిక మాసంలో వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి, స్వామిని దగ్గర నుంచి చూసే భాగ్యం లేకపోవడం బాధాకరమన్నారు. విజయ దశమి ముగిసినా ఇంకా కొనసాగిస్తున్న రూ.20, రూ.50 దర్శనాలను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రస్తుత కార్తిక మాసంలో భక్తులు ఎంతో నిష్ఠతో పూజలు చేస్తారని, అటువంటి భక్తులకు కంచాల్లో కాకుండా, అరటి ఆకుల్లో భోజనం వడ్డించాలన్నారు. దాతలు ఇస్తే మినహా భక్తులకు కనీసం ప్రసాదం కూడా పెట్టలేని పరిస్థితి ఉందన్నారు.

వేధింపులపై డీఎల్‌పీఓకు ఫిర్యాదు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తప్పుడు ఫిర్యాదులు చేయించి, విచారణ పేరుతో తమను ఇబ్బందులు గురిచేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీలో వివిధ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ కాకినాడ డీఎల్‌పీఓ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటరెడ్డి వేరే వారితో గ్రీవెన్స్‌లో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. ఫిర్యాదులను పరిష్కరించుకోకపోతే ఇబ్బందులు తప్పవని కార్యదర్శులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఇదే పరిస్థితి ఉంటే తాము సామూహిక సెలవులు పెట్టి, కుటుంబ సమేతంగా ధర్నాలు చేస్తామని చెప్పారు. డీఎల్‌పీఓ స్పందించి, ఈ విషయాన్ని డీపీఓ దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్నాడ నరసింహారావు, కార్యదర్శులు పాండురంగారావు, కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

బీడువారినట్టేనా..!

- మూలన పడిన కియోస్క్‌లు
- గతంలో వీటి ద్వారా వ్యవసాయ సమగ్ర సమాచారం
- రైతులకు కచ్చిత వివరాలు అందేవి
- ప్రస్తుతం అక్కరకు రాని వైనం ప్రజాధనం వృథా అవుతున్నా కనీస దృష్టి సారించని ప్రభుత్వం



నిరుపయోగంగా ఉన్న కియోస్క్

కాకినాడ సిటీ: నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్‌లు.. నేడు నిరుపయోగంగా ఉన్నాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని 31 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటయ్యాయి. ఆయా కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించిన గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా అవగాహన కల్పించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

నిర్లక్ష్యపు నీడలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌ల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. కేవలం ఎరువులను మాత్రమే బుకింగ్ చేసుకునేందుకు వీటిని వాడుతున్నారు. మరికొంత మంది ఎరువుల బుకింగ్ కూడా మొబైల్‌లోనే చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా, వినియోగంలో లేని కియోస్క్ డిజిటల్ యంత్రాలు బూజుపట్టే పరిస్థితి నెలకొంది. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. మరి ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేకున్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తికావస్తోంది. రానున్న రబీ సీజన్‌కైనా వీటి సంపూర్ణ వినియోగానికి ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఎరువులు అందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూరిత స్థాయిలో అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు పూర్తిస్థాయిలో కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు రైతులు కొనుగోలు చేసుకున్నారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలా రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందించాలి.

– వి.సీతారామరాఘవ, రైతు, విజయరాయుడుపాలెం

డిజిటల్ విధానం అమలు చేయాలి



నాడు రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో కియోస్క్‌ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ సేవల్లో భాగంగా తెలియజేసేవారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా రైతులకు డిజిటల్ సేవలు అందించాలి.

– రావుల ప్రసాద్, రైతు, కూరాడ, కరప మండలం

చిన్నారులతో యాచన చేయించరాదు



కాకినాడ భానుగుడి కూడలిలో అధికారులు కల్పిస్తున్న అవగాహన

కాకినాడ: బిక్షాటనలో ఉండి, చిన్న పిల్లలతో యాచన చేయించే వారిని తమ దృష్టికి తీసుకురావాలని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ అన్నారు. శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ అంశంపై ప్రయాణికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ, యాచన చేయించే, చేసే వారితో పాటు, అనుమానాస్పద వ్యక్తులు చిన్న పిల్లలతో ఉంటే తమ దృష్టికి తీసుకురావొచ్చని సూచించారు. జిల్లా బాలల విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ జె.విజయ్, లీగల్ అధికారి ఎం.సుధాకర్, ఇతర సభ్యులు వి.దుర్గారాణి, ఎస్.చినబాబు, ఆర్.దుర్గాభవాని, ఎస్‌వీ లక్ష్మి మాట్లాడుతూ, ఎక్కడైనా చిన్న పిల్లలు తప్పిపోయినా, అనుమానాస్పద వ్యక్తులు చిన్న పిల్లలతో కనిపించినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ 1098కు కాల్ చేసి సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.శ్రీనివాస్, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తే చర్యలు

కాకినాడ క్రైం: పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న పలువురు తల్లిదండ్రులను అధికారులు గుర్తించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు పీడీ కె.ప్రవీణ ఆధ్వర్యంలో బాలలతో భిక్షాటన నిర్మూలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ వెంకట్రావు పర్యవేక్షణలో బాలల పరిరక్షణ, చైల్డ్ లైన్ 1098 బృందాలు నగరంలో తనిఖీలు నిర్వహించాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్, పలు రద్దీ ప్రాంతాలు, ఆటోస్టాండ్లలో పిల్లల్ని చూపిస్తూ, భిక్షాటన చేస్తున్న తల్లిదండ్రులతో పాటు, స్వయంగా భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను బిచ్చగాళ్లగా మారిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారిని స్కూళ్లలో చదివించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల నుంచి హామీ పత్రం తీసుకున్నారు. బాలలను సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలకు అనుసంధానం చేస్తూ రిజిస్ట్రేషన్లు చేశారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ మనోహర్ తదితరులు

11న ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ధర్నా



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా, సంక్షేమ బోర్డు పథకాల అమలు కోసం ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలో బిల్డింగ్ వర్కర్స్ నాయకుడు సూరిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమ కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, ఇసుక గత ఐదు నెలలుగా అందుబాటులో లేదన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులకు పూర్తిగా ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. నిర్మాణాలు నిలిచిపోవడం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇసుకపై నూతన విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇసుకపై అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. అధికార పార్టీకి చెందిన వారే ఇసుకను అడ్డగోలుగా దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఇసుక నిల్వ స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వమే ఇసుక సరఫరా చేయాలని కోరారు. ఇసుకపై అన్ని రాయితీలు ఎత్తివేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలన్నారు. తెలంగాణలో భవన నిర్మాణ కార్మికులకు ఇస్తున్న పథకాలన్నీ ఇక్కడ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ ప్లాన్‌లో వసూలు చేస్తున్న ఒక శాతం సెస్సు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలన్నారు. ఈ నెల 11న ఉదయం పది గంటలకు కలెక్టరేట్ వద్ద జరిగే భవన నిర్మాణ కార్మికుల ధర్నాకు వివిధ రంగాల కార్మికులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, గోపి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రాగిరెడ్డి సేవలు చిరస్మరణీయం

వైఎస్సార్ సీపీ నేతల ఘన నివాళి



ప్రూటీకుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: పార్టీ పటిష్ఠత కోసం దివంగత వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్(ప్రూటీకుమార్) అవిశ్రాంతంగా శ్రమించారని పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం దివంగత ప్రూటీకుమార్ 4వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావూరి మాట్లాడుతూ, పార్టీపై ఎంతో అంకిత భావంతో కుమార్ పనిచేశారన్నారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు) మాట్లాడుతూ, పార్టీపై నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ, ప్రతి కార్యకర్తకు నేనున్నాననే భరోసానిస్తూ ఎంతో మందికి అండగా నిలిచిన ప్రూటీకుమార్ సేవలు ఆదర్శప్రాయమన్నారు. మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని మాట్లాడుతూ, దివంగత ప్రూటీకుమార్ పేరు చిరస్థాయిగా ఉండేలా ఆయన పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. ఆయన అడుగుజాడల్లో పయనిస్తూ, ఆయన ఆశయ స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నారాయణ పాఠశాలల కాకినాడ డివిజన్ వార్షిక క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌కుమార్, గౌరవ అతిథిగా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి హాజరయ్యారు. పాఠశాలల ఏజీఎం రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ, క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు చదువులో చురుగ్గా ఉంటారని, మానసికోల్లాసానికి క్రీడలు దోహద పడతాయన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు వినయ్, సుంకర మూర్తి, రామతులసి, సఫూరా, సుభద్ర, ప్రిన్సిపాళ్లు విఠల్, రవికిషోర్, షర్మిల, కవిత తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా జిమ్నాస్టిక్ పోటీలు



అల్‌ఈవెన్ బార్‌లో క్రీడాకారిణి విన్యాసం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న 68వ అంతర్‌జిల్లా ఎస్‌జీఎఫ్ఐ జిమ్నాస్టిక్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. అండర్–14, 17, 19 బాలురు బాలికల విభాగాల్లో బీమ్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, టేబుల్‌వాల్ట్, అల్‌ఈవెన్ బార్స్‌లో పోటీలు నిర్వహించారు. అండర్–14 విభాగంలో టీం చాంపియన్‌షిప్‌లో తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాలు తొలి మూడు స్థానాలు పొందాయి. అండర్–17 బాలికల టీం చాంపియన్‌షిప్‌లో కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి జట్లు వరుస స్థానాలు పొందాయి. రిథమిక్ జిమ్నాస్టిక్‌లో అండర్–14లో హూప్, బాల్, క్లబ్స్, రిబ్బన్‌లో పోటీలు జరిగాయి. రాష్ట్ర జిమ్నాస్టిక్ సంఘ అధ్యక్షుడు విఠల్ పోటీలను తిలకించారు.

పిల్లల్లో తార్కిక ఆలోచనలను ప్రోత్సహించాలి



క్లబ్ సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

బాలాజీచెరువు: విద్యార్థుల్లో తార్కిక ఆలోచనలను ప్రోత్సహించి, వారిలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంపొందించాలని లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ డే వేడుకల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా భావి శాస్త్రవేత్తలను ప్రోత్సహించినట్టేనన్నారు. బాలలే రేపటి పౌరులన్నారు. అనంతరం క్లబ్ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎంవీఆర్ మోహన్‌కుమార్, న్యాయ నిర్ణేతలు రామసుబ్బారావు, సతీష్, ప్రాజెక్టు చైర్మన్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులను అధ్యాపకులు తీర్చిదిద్దాలి



సాయిలక్ష్మిని అభినందిస్తున్న శారద

కాకినాడ సిటీ: కళాశాల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు తీర్చిదిద్దాలని విద్యా శాఖ జోన్ 1, 2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శారద అన్నారు. శుక్రవారం ఆమె పీఆర్ ప్రభుత్వ జూనియర్, పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలను వార్షిక పరిశీలన చేశారు. విద్యార్థుల చదువుకు సంబంధించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. కళాశాలల్లోని సమస్యలను తెలుసుకుని, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వృత్తి విద్యా కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ గ్రూపునకు చెందిన సాయిలక్ష్మి 491/500 మార్కులు సాధించడంతో, ఆమెను శారద, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో అభినందించారు. డీఐఈవో గ్రంధి నూకరాజు, ప్రిన్సిపాళ్లు జ్యోతుల రాంబాబు, మావూరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



గొర్రిపూడిలో సిమెంట్ కుండీలో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

కరప: అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే పాటించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించి, పంచాయతీల కార్యదర్శులకు డ్రై డేపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లోని మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బందితో కలిసి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులకు కారణమైన దోమలు పెరుగుతాయన్నారు. ఇంటి ఆవరణలో కానీ, కొబ్బరి చిప్పలు, ఫ్లవర్‌వాజ్‌లు, పాత టైర్లు, పాత సీసాలు, రుబ్బురోళ్లు ఇతర పాత్రల్లో నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రం చేయించారు.

ఘనంగా రేడియాలజీ డే

కాకినాడ క్రైం: ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని కాకినాడ జీజీహెచ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలోని రేడియాలజీ కాన్ఫరెన్సు హాల్లో విభాగాధిపతి డాక్టర్ అనురాధ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి హాజరయ్యారు. డాక్టర్ అనురాధ మాట్లాడుతూ, దేహంలోని బయటకి పనిపించని ఆరోగ్య సమస్యలు గుర్తించేందుకు రేడియాలజీ పరీక్షలే కీలకమన్నారు. జీజీహెచ్‌లో ఐదు ఎక్స్‌రే ప్లాంట్లు, 12 మొబైల్ ఎక్స్‌రే ప్లాంట్లు, 5 అల్ట్రా సౌండ్ పరికరాలు, 2 కలర్ డాప్లర్లతో పాటు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలతో ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, డీసీఎస్ఆర్ఎంవో అనిత, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు కుసుమలత, కేఎస్ సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.హరిత, ఆర్ఎస్ శైలజ, నూర్‌ఉన్నీసా బేగం, ప్రసన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

బోట్‌క్లబ్: విజిలెన్స్ అవగాహన ముగింపులో భాగంగా స్థానిక మెయిన్ రోడ్‌లోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రీజినల్ హెడ్ సాయి మనోహర్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్‌లు నారాయణ, కృష్ణమాచారి ర్యాలీ ప్రారంభించారు. మెయిన్ రోడ్ నుంచి బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయం, పీఆర్ కళాశాల మీదుగా వివేకానంద పార్క్‌కు చేరింది. అనంతరం ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ఉద్యోగులంతా నిబద్ధతతో పనిచేసి, దేశ ప్రజలకు సేవలు అందించాలని సాయి మనోహర్ అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కెనాల్ దుస్థితిపై సాంకేతిక బృంద పరిశీలన



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు

కాకినాడ సిటీ: జాతీయ రహదారి రెండు వైపులా ఉన్న కాకినాడ, సామర్లకోట కెనాల్ మార్గాలను పీపుల్స్ వరల్డ్ కమిషన్ ఆన్ డ్రాఫ్ట్ అండ్ ఫ్లడ్ జాతీయ సేవా సంస్థ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో హైడ్రాలజిస్ట్ మంగళంపల్లి లక్ష్మీనరసింహం శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సామర్లకోట రైల్వే జంక్షన్ నుంచి కాకినాడ ఇంద్రపాలెం లాకులు, మేడలైన్ వంతెన వరకు పూడుకుపోయిన కెనాల్ దుస్థితిని అధ్యయనం చేశారు. శనివారం ఇంద్రపాలెం నుంచి చీడిగ వంతెన మీదుగా ఉన్న ఏలేరు కాలువ మేడలైను వంతెన నుంచి బ్రహ్మం గారి మఠం వార్పు రోడ్డు మీదుగా, వినాయక సాగర్, ఏటిమొగ ఎర్ర రోడ్డు మీదుగా సముద్రానికి కలిసే ఉప్పుటేరును కాకినాడ చాప్టర్ ప్రతినిధి బృందం పరిశీలిస్తుందని బొలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోని పర్యావరణ పరిరక్షణ, ముంపు నివారణ వారసత్వ సంపద గుర్తింపు అంశాలపై కిరణ్ కంటి ఆస్పత్రి మీటింగ్ హాలులో శనివారం ఉదయం సమావేశం జరుగుతుందన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డాక్టర్ చిష్టా కిరణ్, జిల్లా కన్వీనర్ పెసింగ్ ఆదినారాయణ, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు, దుగ్గన బాబ్జీ, మురళీకృష్ణ, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

డీఎంఈ, కలెక్టర్లకు చేరిన విచారణ నివేదిక

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ మేనేజర్ యండమూరి వెంకట సూర్య నాగేంద్ర నరసింగరావుపై నిర్వహించిన విచారణ తుది నివేదిక శుక్రవారం విజయవాడకు చేరింది. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్.నరసింహం, కలెక్టర్ షన్మోహన్‌కు విచారణ నివేదికను పంపారు. ఇప్పటికే నిర్వహించిన లోతైన విచారణలో నరసింగరావు అవినీతి ఆధారాలతో సహా బట్టబయలు కావడంతో ఉన్నతాధికారులు తీసుకోనున్న చర్యలపై ఆసక్తి నెలకొంది.